## ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి...

"నేను ఈ నెల 12వ తేదీన మీ ఊరు వస్తున్నాను" అని రాసేరే తప్ప వివరాలేమీ రాయలేదు. వసతి ఏర్పాటు చేశాం. ఉత్తరం ధోరణి చూస్తే సొంత పనిమీద వస్తున్నట్టు తెలిసింది. ఇప్పుడేమో హిరణ్యాక్ష వరాలడుగుతున్నాడు. వాణ్ణి కలవాలి వీణ్ణి కలవాలంటూను.

పోనీ వాళ్ళెవరో దొరకడం లేదని చెప్పేద్దామా అంటే ఆయన సామాన్యుడుకాడు. మా డిపార్టుమెంటు హెడ్డు. ఢిల్లీలో వుంటున్నాడు. మమ్మల్ని గొయ్యితవ్వి పాతెయ్యడానికి పవర్నున్న వాడు.

రహీంఖానని ఒక షెహనాయి విద్వాంసుడున్నాడట, ఈ వూళ్లో ఆయన్ని కలవాలట ఈయన. సుబ్రహ్మణ్యభట్టని ఒక వ్యాకరణ పండితుడున్నాట్ట. ఆయన్నీ కలవాలట! సిద్ధార్థరే అని ఒక భూగర్భ శాస్త్రవేత్తట, గోమతి అని ఒక నర్తకిట. వాళ్ళందర్నీ కలవాలంటు న్నాడు. రేపు వెళ్ళిపోతాట్ట.

ఇది ఇలా వుండగా-

"మీ ప్రోగ్రాములన్నీ ఏడిసినట్టుంటాయి" అని ఎక్కణ్ణించో ఒక ఉత్తరం. గిరీశంగారు బుచ్చావధాన్లుకి రాసిన ఉత్తరంలా దూకుడుగా ధూర్తంగా వుందా ఉత్తరం.

అంటాడూ :-

"వెనుకటికి రేడియో లైసెన్సులు చెకింగుచేసే అధికారి ఒక ఆసామితో, అయ్యా.... మీ లైసెన్సు పదేళ్ళ కిందటిదండీ అనంటే, తమ ప్రోగ్రాములన్నీ కూడా అప్పటివేనండి అన్నాట్ట ఆ ఆసామీ."

ఇంకా—

"ఎంతసేపూ మీక్కనబడేది విద్యాపీఠమే. అక్కడ తప్ప ఈ ప్రాంతంలో చెప్పుకోదగ్గ మేధావు లెవ్వరూ లేరని మీ ఉద్దేశం కాబోలు. లేక విద్యాపీఠం ఆచార్యవర్యులతో ఏటేటా మీ కేవో పన్లుంటాయి కాబోలు! మంచి ప్రోగ్రాములు చెయ్యగల మహానుభావులు మీ నగరంలోనే అనేకమంది వుండగా "నూని" వర్సిటీ మీంచి దృష్టి మళ్ళదేం మీకు?" అని తగులుకున్నాడు.

ఇందాక ఎక్కణ్ణించో ఎక్కడికో వెడుతూ మా ఆఫీసులో కాసేపు ఆగి, ఈ ఉత్తరం స్టేషన్ డైరెక్టరుగారి బల్లమీద ఉంటే చూసేశాడు "అప్పుడప్పుడు ఇలాటివి తప్పవు. కాని, అందులో రాసినవి కొన్ని నిజాలు లేకపోలేదు!" అన్నాడాయన నవ్వకుండా.

"శలవులో ఉన్నాననుకోండి! అయినా వొక్కమాట అడుగుతాను చెప్పండి" అని తర్జన చూపిస్తూ మా స్టేషన్ డైరెక్టరుగార్ని అడిగాడు.

"ఈ పిడుగు ఈయనమీద పడిపోనీ!" అని మేం నిశ్శబ్దంగా వూరుకున్నాం.

"సాహిత్య కార్యక్రమాలు ఎవరు చూస్తున్నా రిక్కడ?"

అందరం మొహాలు చూసుకున్నాం. "సరే ఎవరైతేయేం? 'ముల్క్‌రాజ్ ఆనంద్ ఈ వూరొచ్చారు; చిన్న ఇంటర్వ్యూచేసి ప్రసారం చేయండి' అని ఎవరో సూచిస్తే, ముల్క్‌రాజ్ ఆనంద్ ఎవరని అడిగాట్టగా, ఆ ప్రబుద్ధుడు?"

మా స్టేషన్ డైరెక్టరు తలవంచుకున్నాడు.

ఆయన అడిగిన అడ్రసులేవీ చెప్పలేకపోయాం. రహీంఖాన్ అనే షెహనాయ్ విద్వాంసుడు యావిద్భారత ఖ్యాతి పొందినవాడు. ఐదేళ్ళ కిందటిదాకా అతని ప్రోగ్రాములు ప్రసారం చేసేం. ఇటీవల అతను దేశం అంతటా కచేరీలు చేస్తూ గ్రామఫోన్ కంపెనీకి రికార్డు లిస్తూ, బొత్తిగా తీరిక లేకుండా తయారయ్యేడు. అంచేత మేం ఆయన్ని మర్చిపోయాం. ఆయన ఎడ్రసు పాత ఫైల్సులోకి వెళ్ళిపోయింది. ఎవరో ఆ మధ్య ఆయన్ని టాప్ స్టాండింగ్ ఆర్టిస్టుగా గ్రేడిమ్మని సూచించారు. మేం మాత్రం ఆయన్ని స్టాండింగ్ టాప్ ఆర్టిస్టుగానే వుంచాం.

"ఆయన ఇల్లు తెలిసిన వాళ్ళెవరూ లేరా?" అని అడిగారు డైరెక్టరు జనరల్‌గారు. సగం కోపంతో, సగం మా అజ్ఞానంపట్ల అసహ్యంతో.

చివరికి ఆయన ఇల్లు తెలిసిన ఒక ప్యూను, ఇల్లు తెలిసిన వాచ్ మేన్‌ని పట్టుకున్నాం.

"ఆయన్ని వెంటనే పిలిపిస్తాం" అన్నారు మా స్టేషన్ డైరెక్టరుగారు.

"పిలిపిస్తారా!" అని తాను అవమానం పొందినంత కోప్పడ్డారు డైరెక్టర్ జనరల్‌గారు. ఎదురు చెప్పలేక పోయాం.

"పిలిపించడం కాదు నేనే ఆయన దగ్గర కెళ్ళాలి. టైం వేస్టు అనుకోని వాళ్ళుంటే నా కూడా రండి, ఒకరిద్దరు!"

చివరికి ఆ వాచ్‌మన్‌గాణ్ణి కారెక్కించాం.

కారు బయల్దేరిన తర్వాత మళ్ళీ వెనక్కి పోనిమ్మని, "ఎందుకేనా మంచిది ఒక టేప్ రికార్డరు తీసుకురండి!" అన్నారు డైరెక్టర్ జనరల్‌గారు.

సందులూ, గొందులూ తిరిగి ఖాన్‌గారిల్లు చేరుకున్నాం. అంత సన్నటి సందులో అంత సామాన్యమైన "లుక్" అంత శుభ్రమైన ఇళ్లుంటాయని నేను వూహించలేక పోయాను.

డైరెక్టర్ జనరల్‌గారు ఆయనని చూస్తూనే రెండు చేతులా నమస్కారం చేస్తూ వెళ్ళి ఆయన కాళ్ళమీద పడ్డారు. ఖాన్‌గారు లేచి, ఆయన్ని లేవనెత్తి, కౌగలించుకొని కన్నీళ్లు పెట్టుకుని,

"తమలాంటి పున్నతాధికారులు ఈ పేదవాణ్ణి ఇలా సన్మానించడం కళకి గౌరవం; వ్యక్తిగా నాకు శివసాయుజ్యం!" అన్నాడు.

అప్పటికప్పుడు ఎంత ఆప్యాయపు లోతులకో వెళ్ళిపోయారు వాళ్ళిద్దరూనూ.

క్షణాలమీద షెహనాయ్ పుచ్చుకుని, తబ్లా శృతి ఏర్పాటుచేసి పరిపూర్ణ విశ్లేషణతో ఒక సాయంకాల రాగం, రెండు ట్రుమీలు, ఒక స్వర్‌సాగర్ (రాగమాలిక) వాయించారు. టేపు రికార్డర్ పెట్టినట్టు ఖాన్‌గారికి తెలియనే తెలియదు. టేపు అయిపోతూ వుంటే తప్ప గంటంపావు అయిందని మాకు తెలియదు.

ఇవతలి కొచ్చేస్తూన్నప్పుడు మా డైరెక్టర్ జనరల్‌గారు ఖాన్‌గారితో అన్నారు: "ఇవాళ మిమ్మల్ని నిజమైన ఇన్‌స్పిరేషన్లో చూశాను. ఈ మధుర క్షణాలు గుర్తుండడానికి మీ సంగీతాన్ని పట్టుకున్నాను. మీరు అనుమతిస్తే నా దేశ ప్రజలకి వినిపిస్తాను. మీరు అనుమతించకపోతే ఏముంది, నేనొక్కణ్ణీ వింటాను!" అని అమృతమయమైన చిరునవ్వు నవ్వారు.

నిజమైన కళాకారుణ్ణి ఎలా పట్టుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలీదంటే తెలీదు మరి.

(5-11-77)